ఎమ్మెల్యేను కలిసిన ఆలయ కమిటీ సభ్యులు

దుండిగల్: భౌరంపేటలోని బంగారు మైసమ్మ ఆలయ నూతన కమిటీ సభ్యులు చింతల్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మురళీయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి



కిట్లు పంపిణీ చేస్తున్న చంద్రమోహన్, కృష్ణారెడ్డి

కుత్బుల్లాపూర్: పారిశుద్ధ్య నిర్వహణలో కార్మికుల సేవలు వెలకట్టలేనివని కొంపల్లి మున్సిపల్ స్పెషల్ అధికారి చంద్రమోహన్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ కృష్ణారెడ్డితో కలిసి పారిశుద్ధ్య కార్మికులకు గురువారం కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ తిరుపతి, ఆర్‌వి రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జానీ, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రాఘవచారి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ

టీఎన్జీఓస్ ఆధ్వర్యంలో వీడ్కోలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘానికి 4 దశాబ్దాలుగా విశిష్ట సేవలందించిన కే లక్ష్మణ్ గురువారం ఉద్యోగ విరమణ చేశారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్, టీఎన్జీవోఎస్ నాయకులు రామ్మోహన్, రవిప్రకాష్, ఈశ్వర్, శశికాంత్‌రెడ్డి, విజయ్‌కుమార్, శివకుమార్, రవిచంద్రన్, భరత్కుమార్, శేషసాయి, గిరికాంత్, కార్తీక్, నసీమా, సత్య జ్యోతి, అరుణ తదితరులు పాల్గొనారు.

ఆలయ స్వాగత తోరణం పునఃనిర్మించాలి



కమాన్‌ను ఢీ కొట్టిన లారీ

శామీర్‌పేట్: అలియాబాద్ చౌరస్తాలోని సీతా రామచంద్రస్వామి కమాన్ (స్వాగత తోరణం) వెంటనే పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ లో పలువురు నాయకులు ఫిర్యాదు చేశారు. కరీంనగర్ – హైదరాబాద్ రాజీవ్ రహదారికి అనుకొని ఉన్న అలియాబాద్ చౌరస్తా వద్ద కమాన్‌ను దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారు. కాగా బుధవారం రాత్రి ఓ ప్రైవేట్ కంపెనీకి చెందిన లారీ కమాన్‌ను ఢీ కొట్టడంతో ధ్వంసమైంది. దీంతో పురాతనమైన దేవాలయ కమాన్‌ను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించడంతో పాటు పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని గురువారం శామీర్‌పేట పోలీసులకు వివిధ పార్టీల నాయకులు ఫిర్యాదు చేశారు. మాజీ సర్పంచులు, మాజీ వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జేఎన్‌వీ రీజియన్ స్థాయి పోటీల్లో హవేరీ క్లస్టర్ విజేత



రాయదుర్గం: జవహర్‌నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ ముగిసింది. ఈ పోటీల్లో నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ స్థాయి విజేతగా హవేరీ క్లస్టర్ నిలిచింది. మూడు రోజులపాటు గోపన్‌పల్లిలోని పీఎంశ్రీ జవహర్‌నవోదయ విద్యాలయ రంగారెడ్డి జిల్లా క్యాంపస్‌లో ఈ వాలీబాల్ రీజియన్ స్థాయి పోటీలను నిర్వహించారు. దక్షిణ భారతదేశానికి చెందిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని జవహర్ నవోదయ విద్యాలయలకు చెందిన 8 క్లస్టర్లు అండర్–14, 17, 19 విభాగాల్లో బాలబాలికల జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. ఇందులో ఓవరాల్ చాంపియన్‌గా హవేరీ క్లస్టర్ నిలిచింది. ముగింపు సమావేశంలో నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ అభిజిత్ బెహరా మాట్లాడుతూ..జవహర్ నవోదయ విద్యాలయాల్లో చదువుతోపాటు విద్యార్థులకు క్రీడలు, ఇతర రంగాల్లో రాణించేలా, ఆరోగ్యం పై శ్రద్ధ వహించేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ చక్రపాణి, నేషనల్ లీడర్‌షిప్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ రీజియన్ ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్ నాగభూషణం, విద్యాలయ రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపాల్ విజయ భాస్కర్, ఉపాధ్యాయులు, కోచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాబోయ్..
ఇక్కడ బతకలేం..!

జీడిమెట్ల పారిశ్రామికప్రాంతంలో 1200 పైచిలుకు ఫ్యాక్టరీలు

- కాలుష్యంతో సతమతం అవుతున్న ప్రజలు
- తాగునీరు, పీల్చే గాలి రెండూ కలుషితమే
- వీలైనంత త్వరగా వాటిని తరలించాలని స్థానికుల వినతి



నాలాలో పారుతున్న రసాయనాలు

జీడిమెట్ల: మనిషి ప్రశాంత జీవనానికి స్వచ్ఛమైన గాలి, శుద్ధజలం అవసరం. కానీ జీడిమెట్ల పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ రెండు లేకుండా పోయాయి. సుమారు 3 దశాబ్దాల క్రితం జీడిమెట్ల పారిశ్రామికప్రాంతంలో పరిశ్రమలు స్థాపించారు. ప్రస్తుతం అవి సుమారు 1200పై చిలుకు వరకు చేరాయి. వీటి చుట్టూ దాదాపు 20 కాలనీలు ఉండగా లక్షకు పై చిలుకు ప్రజలు నివసిస్తున్నారు. అయితే వీరంతా అటు పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్య కారకాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యాక్టరీల నుంచి వెలువడే రసాయనాలు ఇక్కడి భూమిలో ఇంకిపోవడంతో 10 కిలోమీటర్ల రేడియస్‌లోని జీడిమెట్ల చుట్టు పక్కల పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. ఇక్కడి బోర్ల నుంచి నిత్యం రసాయనాలతో కూడిన నీరు బయటకు వస్తోందని, అవి తాగేందుకు, కనీస అవసరాలకు కూడా పనికి రాకుండా ఉంటున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరికి ప్రభుత్వం సరఫరా చేసే నీరే దిక్కవుతోంది. మరో వైపు పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం వలన కలుషితం అయిన గాలి పీల్చుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.



జీడిమెట్లలో ఓ పరిశ్రమ నుంచి వెలువడుతున్న పొగ

కాలుష్య కారక పరిశ్రమల తరలింపు ఎప్పుడో..?

గత ఆరేళ్లుగా జనావాసాల మధ్యలోని కాలుష్యం వెదజల్లే పరిశ్రమలను ఓఆర్ఆర్ ఆవలి వైపు తరలించాలని ప్రభుత్వం నుంచి జీఓలు వెలువడ్డాయి. కానీ ఇది అచరణలోకి మాత్రం రావడం లేదు. దీంతో చాలావరకు పారిశ్రామిక చుట్టు పక్కల ప్రాంతంలోని ప్రజలు రింగురోడ్డు ఆవలి వైపు ఇళ్లు కొనుక్కుంనేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వారం క్రితం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. జనావాసాల మధ్య కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను ఓఆర్ఆర్ ఆవలి వైపు తరలించాలని అందుకు సంబంధించిన పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు పట్టించుకుని వీలైనంత త్వరగా కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను జీడిమెట్ల నుంచి తరలించాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

రోగాల బారిన పడుతున్నాం..



20 ఏళ్లుగా జీడిమెట్ల ప్రాంతంలోనే నివసిస్తున్నాం. రోజురోజుకూ ఇక్కడ కాలుష్యం పెరుగుతుందే కానీ తగ్గడం లేదు. కాలుష్యం వలన చిన్న వయస్సులోనే ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను ఇక్కడ నుండి తరలిస్తే ఎంతో మేలు చేసిన వారవుతారు.

– వెంకటరెడ్డి, అపురూపాకాలనీ వాసి

చాలా ఇబ్బందులు పడుతున్నాం..



16 ఏళ్లుగా సుభాష్‌నగర్‌లో నివాసిస్తున్నాం. ఇక్కడి ఫ్యాక్టరీల వల్ల గాలి కలుషితం అవుతోంది. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇక్కడి నుంచి మరో చోటికి వెళ్దామంటే ఇంటిని విడిచి వెళ్లలేకపోతున్నాం. గంపలబస్తీలోని రీసైక్లింగ్ యూనిట్ల వలన తీవ్రమైన కాలుష్యం వెలువడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు పట్టించుకుని కాలుష్య కారక పరిశ్రమలను ఇక్కడి నుంచి తరలించాలి.

– గోదావరి, సుభాష్‌నగర్

రెడ్‌జోన్ పరిశ్రమల నివేదికను ప్రభుత్వానికి పంపించాం..



గతంలో ప్రభుత్వం ఇచ్చిన జీఓ ప్రకారం ఇండస్ట్రీయల్ ప్రాంతాల్లోని రెడ్‌జోన్ పరిశ్రమలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించాం. ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ఓఆర్ఆర్ ఆవలి వైపు ఇండస్ట్రీయల్ కారిడార్‌ను ఏర్పాటు చేసి ఇక్కడి కాలుష్యకారక పరిశ్రమలను తరలించాల్సి ఉంటుంది. సీఎం రేవంత్‌రెడ్డి కూడా త్వరగా తరలించే ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈమేరకు చర్యలు తీసుకుంటాం.

– రాజేందర్, పీసీబీ అధికారి మేడ్చల్ జిల్లా

మొక్కలు నాటి సంరక్షించాలి

రంగారెడ్డినగర్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ పిలుపునిచ్చారు. రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలోని జీహెచ్ఎంసీ పార్కు–1లో అటవీ శాఖ ఆధ్వర్యంలో గురువారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై కాలనీవాసులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇష్టానుసారంగా చెట్లను నరికివేయడంతో పర్యావరణంపై పెను ప్రభావం చూపుతోందని, సకాలంలో వానలు పడక రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇంటింటికీ 2 చొప్పున మొక్కలు నాటేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ నరసింహ, కార్పొరేటర్ విజయ్ శేఖర్‌గౌడ్,, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రఘువీర్ రెడ్డి, హార్టికల్చర్ యూబీడీ దివ్య, సీఐ నరసింహ రాజు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, కాలనీవాసులు సాయికిరణ్, జగన్, రత్తయ్య, రమణయ్య, సుధాకర్ రావు, వెంకట్ రెడ్డి, ఓం ప్రకాశ్, నాయకులు కార్తీక్ గౌడ్, సతీశ్ గట్టోజీ, తారక రాణి, ఈశ్వరి, బాలు నేత, కొండ శ్రీను, కిరణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మొక్కు నాటుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

వనాలతోనే మానవ మనుగడ

జీడిమెట్ల: వనాలతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని అపురూపా కాలనీ టీవీఆర్ మోడల్ స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ వంశీకృష్ణారెడ్డి అన్నారు. పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు గ్రీన్‌డే కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులు పచ్చనిరంగు దుస్తులు ధరించి పాఠశాలకు వచ్చారు. అనంతరం స్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీలో చైన్ స్నాచింగ్

కేపీహెచ్‌బీకాలనీ: వృద్ధురాలి మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన ఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ 3–ఫేజ్‌లోని భువన విజయం గ్రౌండ్స్ వద్ద నివాసం ఉండే చింత శ్యామల (70) గురువారం ఉదయం పాల ప్యాకెట్ కోసం షాపునకు వెళ్లింది. కారులోని ఇద్దరు వ్యక్తులు వచ్చి పేపర్ చూపిస్తూ అడ్రస్ చెప్పాలని హిందీలో అడిగాడు. దీంతో తనకు తెలియదని శ్యామల ముందుకు వెళ్లింది. కారులో వెనకాలే వచ్చిన ఆ వ్యక్తి మళ్లీ శ్యామల వద్దకు వచ్చి ఆమెను కిందకు తోసి మెడలోని బంగారు గొలుసును తీసుకునేందుకు యత్నించగా ప్రతిఘటించింది. దీంతో గొలుసు రెండు ముక్కలుగా తెగిపోగా ఒక ముక్క తీసుకుని దుండగుడు కారు ఎక్కి వెళ్లిపోయాడు. దీంతో బాధితురాలు కేపీహెచ్‌బీ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ చోరీ నిందితుల రిమాండ్

ఘట్‌కేసర్: బైక్ చోరీ నిందితులను ఘట్‌కేసర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట్ గవర్నమెంట్ క్వార్టర్స్ బతుకమ్మకుంటకు చెందిన ఆటో డ్రైవర్ చింతల మహేష్(20), డెకరేషన్ పనిచేసే రామగల్ల శ్రీధర్ అలియాస్ నిఖిల్ (20) ఘనాపూర్‌లోని అశ్విజ వసతి గృహం వద్ద పార్కు చేసిన (ఏపీ–20 ఏజే–9394) స్ప్లెండర్ బైక్‌ను జూలై 7న భువనగిరి టీ పాయింట్ వద్ద పార్కు చేసిన గ్లామర్ బైక్‌ను 27న అపహరించారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. మహేష్‌పై ఎల్‌బీనగర్, ఉప్పల్ పోలీస్‌స్టేషన్ బైక్ చోరీ నిందితుడు కాగా.. శ్రీధర్‌పై ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు ఉంది. నిందితులపై నల్లకుంట, ఉప్పల్, అంబర్‌పేట్, ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు ఉన్నాయి. ఈ మేరకు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

మల్లన్న కాలనీలో కార్డన్ సెర్చ్



వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: సైబరాబాద్ సీపీ ఆదేశాల మేరకు మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి నేతృత్వంలో పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధి దేవరయాంజాల్ మల్లన్న కాలనీ ఫేజ్–2లో గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో డీసీపీ కోటిరెడ్డి వివరాలు వెల్లడించారు. 283 మంది సిబ్బందితో కలిసి 620 ఇళ్లల్లో తనిఖీ చేయగా గంజాయి సేవించిన ఇద్దరు, ఇద్దరు అనుమానితులు, రౌడీషీటర్‌ను గుర్తించామని, అదేవిధంగా బెల్ట్ షాప్ నుంచి 74.2 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే 332 వాహనాలను తనిఖీ చేసిన పోలీసులు 88 మందిపై ట్రాఫిక్ కేసులు నమోదు చేయడంతో పాటు రూ.1.04,080 పెండింగ్ చలాన్లు వసూలు చేశామని ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేని 35 వాహనాలు సీజ్ చేశామని తెలిపారు. అదేవిధంగా 300 నిషేధిత గుట్కా ప్యాకెట్లు, 63 గ్యాస్‌సిలీండర్లు, ఒక వెయింగ్ మిషన్, గ్యాస్‌కట్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. అక్రమంగా నడుపుతున్న హుక్కా సెంటర్‌పై దాడులు చేసి రెండు హుక్కా పాట్లను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేశామని తెలిపారు. మేడ్చల్ అడిషనల్ డీసీపీ పురుషోత్తం, మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి, పేట్‌బషీరాబాద్ ఏసీపీ బాలగంగిరెడ్డి, పేట్‌బషీరాబాద్ సీఐ విజయవర్ధన్, ఆయా పోలీస్‌స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

రాంగ్‌రూట్‌లో.. రయ్ రయ్..!



కుత్బుల్లాపూర్: కొందరు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అడ్డదిడ్డంగా నడుపుతూ ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. సుచిత్ర నుంచి కొంపల్లి వరకు ఓ వైపు ఫ్లై ఓవర్ పనులు జరుగుతుండగా అల్వాల్ ట్రాఫిక్ పోలీసులు పలు ప్రాంతాల్లో వన్ వే తో పాటు యూటర్న్‌లు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ కొంతమంది వాహనదారులు ఇష్టానుసారంగా రాంగ్ రూట్లో వచ్చి ఇతరులకు ఇబ్బందికరంగా మారుతున్నారు. ముఖ్యంగా డీమార్ట్ సమీపంలో వివిధ కాలనీలకు వెళ్లేవారు రాంగ్‌రూట్‌లో వచ్చి ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొడుతున్నారు. అదేవిధంగా రెనోవా ఆస్పత్రి ఎదుట సైతం యూటర్న్ ఏర్పాటు చేయగా రాంగ్‌రూట్‌లో వాహనాలు రావడం విశేషం. స్థానికంగా ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనదారులు

'మహిళా సాధికారత'పై అవగాహన సదస్సు

నిజాంపేట్: మున్సిపల్ కార్పొరేషన్ భవ్యస్ ఆనంద్ గేటెడ్ కమ్యూనిటీలో మహిళా సాధికారత, అభివృద్ధి అవగాహన సదస్సు గురువారం జరిగింది. ఈ సందర్భంగా పోలీసులు, ఉమెన్స్ సేఫ్టీ వింగ్స్, మహిళా సాధికారిక అభివృద్ధి సంస్థ నిర్వాహకులు సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై స్థానిక మహిళలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా గృహ హింస, కుటుంబ కలహాలు రాకుండా సూచనలు, ఒకవేళ తలెత్తితే పరిష్కారాలను వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీ భాస్కర్ రెడ్డి, డాక్టర్ మోదులే, బాచుపల్లి ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ సంధ్య, ప్రోగ్రాం మేనేజర్ వీ అనూష, భవ్యస్ ఆనందం నిర్మాణ సంస్థ సీతారాం, అధ్యక్షురాలు రమణి, బాచుపల్లి సీడీఈడబ్ల్యూ ఫ్యామిలీ కౌన్సెలింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మహిళలు

జనహిత పాదయాత్రకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు



పాదయాత్రలో టీపీసీసీ అధ్యక్షుడితో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన జనహిత పాదయాత్రకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో గురువారం తరలి వెళ్లారు. రంగారెడ్డి జిల్లా పరిగి నుండి వర్ధన్నపేట్ వరకు కొనసాగిన పాదయాత్రలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



యాత్రకు తరలివెళ్తున్న శ్రేణులు

బాచుపల్లి పార్టీ కార్యాలయం నుంచి..

నిజాంపేట్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అధ్యక్షతన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి ఆధ్వర్యంలో బాచుపల్లి కాంగ్రెస్ కార్యాలయం నుండి శ్రేణులు తరలివెళ్లారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, యువజన నాయకులు, మైనార్టీ నాయకులు, అభిమానులు వెళ్లారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

దుండిగల్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శంభీపూర్‌లోని కార్యాలయంలో వివిధ బస్తీలు, కాలనీల సంక్షేమ సంఘ ప్రతినిధులు గురువారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా రోడ్లు వేయాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. అదేవిధంగా పలువురు వివిధ శుభకార్యాలకు హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రికలు అందజేశారు, స్పందించిన ఎమ్మెల్సీ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు.



ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజుతో సంక్షేమ సంఘ ప్రతినిధులు

దండమూడికాలనీలో వరుస చోరీలు



శ్రీనివాస్ రెడ్డి ఇంట్లో ఫింగర్ ప్రింట్స్ సేకరిస్తున్న పోలీసులు



అక్షయ్ బాబు నివాసం

కుత్బుల్లాపూర్: ఒకే కాలనీ.. పక్కపక్క ఇళ్లు.. 2 రోజుల వ్యవధిలోనే ఆ రెండిళ్లలో దొంగతనం జరగడం కలకలం రేపింది. పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన చోరీల వివరాలు ఇలా ఉన్నాయి. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని దండమూడికాలనీలో నివాసముండే శ్రీనివాస్‌రెడ్డి కుటుంబంతో కలిసి తిరుపతికి వెళ్లి బుధవారం ఇంటికి చేరుకోగా తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి పరిశీలించగా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చి విలువైన వస్తువులను పరిశీలించగా లాకర్ తెరుచుకోకపోవడంతో అందులోని నగలు మాత్రం భద్రంగా ఉన్నాయి. సుమారు రూ. 30 వేలు ఎత్తుకెళ్లినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే గురువారం రాత్రి ఇదేకాలనీలో ప్లాట్ నంబర్ 80 అక్షయ్ బాబు ఇంట్లో దొంగతనం జరగగా వారు కెనడా పర్యటనలో ఉండడంతో పోలీసులు ఇంట్లోకి వెళ్లి పరిశీలించారు. ఇదే విషయాన్ని ఫోన్ ద్వారా పోలీసులు అక్షయ్ బాబుతో మాట్లాడి పంచనామా నిర్వహించారు. పేట్ బషీరాబాద్ పోలీసులతోపాటు ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీం, సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగి ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించారు. మొదటి రోజు దొంగతనం జరిగిన విషయంపై ఆరా తీయగా ముగ్గురు వచ్చినట్లు తేలింది. అదేరోజు అర్ధరాత్రి 2: 30 సమయంలో ముగ్గురు నడుచుకుంటూ వచ్చి వెళ్లినట్లు గుర్తించారు. రెక్కీ నిర్వహించిన తర్వాతే దొంగతనం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉంటే వరుస చోరీలతో దండమూడికాలనీ ప్రాంతం ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అధికారులు.. జర చూడరూ..!

రోడ్లవెంటే ఇష్టారాజ్యంగా చెత్తాచెదారం వేస్తున్న వైనం

రంగారెడ్డినగర్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని అధికారులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ప్రజల్లో మాత్రం మార్పు రావడం లేదు. ఇళ్ల నుంచి వెలువడే చెత్త వ్యర్థాలను ప్రధాన రోడ్ల వెంబడి పారబోస్తుండడంతో పరిసరాలు అధ్వానంగా మారుతున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ గిరినగర్ నాలా కల్వర్ట్ సమీపంలో చుట్టు పక్కల ప్రాంతవాసులు పెద్ద ఎత్తున చెత్తను వేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో చెత్త కుళ్లి తీవ్ర దుర్వసన వస్తోందని పలువురు వాపోతున్నారు. అసలే ఓ వైపు గాజులరామారం, కుత్బుల్లాపూర్ జంట సర్కిళ్ల పరిధిలో వైరల్ జ్వరాలు, మలేరియా, డెంగీ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్త వేయకుండా కఠినంగా వ్యవహరించాలని స్థానికులు కోరుతున్నారు.



గిరినగర్ నాలా కల్వర్ట్ సమీపంలో వేసిన వ్యర్థాలు

మహిళ అదృశ్యం



రేఖ కోల్

మియాపూర్: మహిళ అదృశ్యమైన ఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. మియాపూర్ న్యూ హాఫీజ్‌పేటలోని మార్తాండ నగర్ కాలనీలో రాజారామ్ కుమార్, రేఖ కోల్(20) 15 ఏళ్లుగా నివాసముంటున్నారు. గత నెల 29న రాజారామ్ కిరాణ దుకాణానికి వెళ్లాడు. 9 గంటల సమయంలో భార్య రేఖ కోల్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. వెంటనే ఇంటికి వచ్చిచూడగా ఇంటిదగ్గర భార్య రేఖకోల్ కనిపించలేదు. ఇంటికి తాళం వేసి ఉంది. రాత్రి అయినా భార్య ఇంటికి రాకపోవడంతో చుట్టు పక్కల, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో ఎంతవెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆందోళన చెందిన రాజారామ్ మియాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.